ప్రజాశక్తి
శుక్రవారం 24 అక్టోబర్ 2025 | 5 | అనంతపురం

జడివాన

ఉమ్మడి జిల్లాలో తేలికపాటి వర్షాలే

ప్రజాశక్తి -అనంతపురం

రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో మంచి వర్షాలు పడుతుంటే అనంతపురం ఉమ్మడి జిల్లాలో మాత్రం జడివాన కురుస్తోంది. మేఘాలు దట్టంగా ఉంటున్నప్పటికీ తేలికపాటి వర్షాలే పడుతున్నాయి. రెండు రోజులుగా జిల్లాలో జడివానే ఉంటోంది. గురువారం రోజు అనంతపురం జిల్లా వ్యాప్తంగా 15 మిల్లీమీటర్ల సగటుతో వర్షపాతం నమోదయింది. మండలాల వారీగా చూస్తే బ్రహ్మసముద్రంలో అత్యధికంగా 65.6 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. కళ్యాణదుర్గంలో 58.4 మిల్లీమీటర్లు, శెట్టూరులో 47.4మిల్లీమీటర్లు, గుమ్మగట్టలో 38.4 మిల్లీమీటర్లు, కంబదూరు 28.4 మిల్లీమీటర్లు, యాడికి, యల్లనూరు 24.4 మిల్లీమీటర్లు, గుత్తిలో 22.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. తక్కిన మండలాల్లో తేలికపాటి చిరు జల్లులే పడ్డాయి. ఇక శ్రీసత్యసాయిజిల్లాలో బుధవారం కురిసిన వర్షానికి 434.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కనగానపల్లి మండలంలో 29.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా నల్లమాడలో 28.0, తాడిమర్రిలో 25.0, ఎన్‌పి కుంటలో 22.4, సికె. పల్లెలో 20.8, రొద్దంలో 20.4, కదిరిలో 18.4, మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. అత్యల్పంగా పరిగిలో 2.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. జిల్లాలోని మొత్తం 32 మండలాల్లో ఒక మోస్తారు వర్షం కురిసింది.

నగరంలో జోరువాన : ఉదయం నుంచి కురుస్తున్న జడివాన రాత్రి 7గంటల నుంచి జోరందుకుంది. దీంతో అనంతపురం నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుప్రాంతాల్లో విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

రబీలోనూ సాగు లేదు...

ఖరీఫ్‌లోనూ తక్కువే..
ప్రభుత్వ తోడ్పాటు కరువు

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

రబీ సీజన్ లోనూ సాగు మందగమనంగా ఉంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఉమ్మడి అనంతపురం జల్లాలో పంట సాగు నిరాశాజనంగా సాగింది. రబీలో ఇప్పటి వరకు అనంతపురం జిల్లాలో ఐదు శాతమే పంటలు సాగయ్యాయి. ఇక సత్యసాయి జిల్లాలో రెండు శాతమే సాగైంది. సీజన్ ఆరంభమై ఇప్పటి వరకు రబీలో సాగయ్యే ప్రధాన పంట పప్పుశనగకు సబ్సిడీ విత్తనాన్ని రైతులకు అందజేయలేదు. ఇప్పటికే విత్తన అందజేసి ఉంటే ఈ వర్షాల్లోనైనా సాగు విస్తీర్ణం కొంత వరకు పెరగడానికి అవకాశముండేది. అనంతపురం జిల్లాలో రబీలో 3.12 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయి. ఇప్పటి వరకు 14099 ఎకరాల్లోనే పంట సాగైంది. అంటే ఐదు శాతం లోపే అనంతపురం జిల్లాలో రబీలో పంటలు సాగయ్యాయి. ఇక సత్యసాయి జిల్లాలో రబీలో సాగయ్యేదే చాలా తక్కువ . 80 వేల ఎకరాల్లోనే రబీలో పంటలు సాగవుతాయి. కాని ఇప్పటి వరకు అయింది 1771 ఎకరాల్లోనే మాత్రమే. అంటే రెండు శాతంలోపే ఉంది. పంటల వారీగా చూస్తే రబీలో ప్రధాన పంట పప్పుశనగ నల్లరేగడి నేలలున్నా ప్రాంతాల్లోనే సాగవుతుంది. ఈ పంట చూస్తే రబీలో అనంతపురం జిల్లాలో 1.60 లక్షల ఎకరాల్లో సాగవ్వాల్సుంది. కాని ఇప్పటి వరకు సాగైంది 14 వేల ఎకరాల్లోనే. సత్యసాయి జిల్లాలో ఐదు వేల ఎకరాల్లో సాగవ్వాల్సి ఉండగా పది ఎకరాల్లో మాత్రమే పంట వేశారు. నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో వేరుశనగ పంటను సాగు చేస్తారు. దీని సాగు విస్తీర్ణం చూస్తే అనంతపురం జిల్లాలో 45 వేల ఎకరాలకుగానూ ఇప్పటివరకు 20 ఎకరాల్లో సాగైంది. సత్యసాయి జిల్లాలో 45 వేల 555 ఎకరాలకుగానూ 407 ఎకరాల్లో విత్తనం పడింది. వరి అనంతపురంలో 15 వేలు, సత్యసాయిలో 3041 ఎకరాలకుగానూ ఒక్క ఎకరంలోనూ విత్తనం పడలేదు. మొక్కజొన్న పంట అనంతపురం జిల్లాలో 20 వేల ఎకరాల్లో సాగవ్వాల్సి ఉండగా 111 ఎకరాల్లో సాగైంది. సత్యసాయి జిల్లాలో పది వేల ఎకరాలకుగానూ 227 ఎకరాల్లో విత్తనం వేశారు. ఇవి ప్రధాన పంటల పరిస్థితి. ఇవి కాకుండా ఇతర పంటలు కూడా ఇదే రకంగా రబీలో సాగయ్యాయి.

ఖరీఫ్‌లోనూ ఇదే పరిస్థితి

ఖరీఫ్ సీజన్‌లో ఈ ఏడాది సాగు ఆశించినంత జరగలేదు. ఖరీఫ్‌లో ఈ ఏడాది 9.78 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయాలన్నది లక్ష్యం. అయితే సాగైంది 6.03 లక్షల ఎకరాల్లోనే అంటే 71 శాతం మాత్రమే పంటలు సాగయ్యాయి. ఇంకా సుమారు 3.75 లక్షల ఎకరాలు బీడుగా ఉండిపోయింది. ఇక సత్యసాయి జిల్లాలో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఇక్కడ ఖరీఫ్‌లో 7.54 లక్షల ఎకరాలకుగాను 2.14 లక్షల ఎకరాల్లో సాగైంది. అంటే 39శాతం మాత్రమే సాగైంది. 5.40 లక్షల ఎకరాలు బీడుగా ఉండింది.

పకృతి, ప్రభుత్వ తోడ్పాటు కరువు : ఈ రెండు సీజన్‌లో సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోవడానికి ప్రధాన కారణం ప్రకృతి తోడ్పాటు లేకపోవడంతో ప్రభుత్వ సహకారం లేకుండా పోయిందన్న విమర్శ ఉంది. ఖరీఫ్‌కు కీలకమైన జూన్, జులై మాసాల్లో తీవ్ర వర్షాభావం ఉంది. ఇది రెండు జిల్లాల్లోనూ నెలకొంది. ఆగస్టులో అధిక వర్షాలు పడ్డాయి. అయితే సాగుకు అనువైన జులైలో వర్షం లేకపోవడంతో ప్రధాన పంట వేరుశనగ సాగు చేయలేకపోయారు. అదును దాటక ఆగస్టులో వర్షాలొస్తే ఆ సమయంలో ప్రభుత్వం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాన్ని ఇచ్చే ప్రయత్నం చేయలేదు. దీంతో సాగు విస్తీర్ణం ఆశించినంత పెరగలేదు. ఇక రబీలోనూ సెప్టెంబరు, అక్టోబరు మాసంలో తిరిగి వర్షాభావం నెలకొంది. దీంతో రబీ సాగు ముందుకు సాగడం లేదు. కనీసం పప్పుశనగ విత్తనాన్ని ఇప్పటి వరకు అందజేయలేదు. ఇప్పటికి పంపిణీ చేసి ఉంటే ఈ రబీలోనైనా రైతులు పంటలు సాగు చేసుకునేందుకు వీలుండేది. మొత్తంగా ఖరీఫ్, రబీ రెండు సీజన్లలోనూ సాగు విస్తీర్ణం తగ్గిపోయింది.

పెంచిన రాయల్టీని తగ్గించాలి

సిఐటియు నాయకులు నరసింహ, ఉమాగౌడ్

ప్రజాశక్తి-తాడిపత్రి

విలేకరులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన రాయల్టీని తగ్గించి తాడిపత్రి చుట్టుపక్కల ఉన్న నల్లబండల పరిశ్రమలను ఆదుకోవాలని సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు ఉమాగౌడ్, నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కష్టాల్లో మునిగి తేలుతున్న నాపరాతి పరిశ్రమను కూటమి ప్రభుత్వం మరింత కష్టాల్లోకి నెట్టేసిందన్నారు. నియోజకవర్గంలో వ్యవసాయం తర్వాత నాపరాతి పరిశ్రమ పెద్దది అన్నారు. నాపరాతి గనులు, పాలీష్ ఫ్యాక్టరీలు, లోడింగ్, అన్లోడింగ్ కార్మికులు, ట్రాక్టర్, లారీ డ్రైవర్లు ఇలా వేలాది మంది కార్మికులు ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం నాపరాళ్లు, ఇతర ఖనిజాల ఎగుమతి చేసేందుకు వసూలు చేసే సీనరేజ్ (రాయల్టీ)ని ప్రయివేట్ సంస్థకు అప్పగించిది. దీంతో ఆ సంస్థ ఈనెల 8 నుంచి రాయల్టీ వసూలు చేసేందుకు రంగంలోకి దిగి నాపరాళ్ల రవాణా చేసేందుకు టన్నుకు రూ.222 చొప్పున వసూలు చేస్తోందని వాపోయారు. రాయల్టీ కట్టలేక యజమానులు ఎక్కడికక్కడే ట్రాక్టర్లను నిలిపేశారన్నారు. రోజూ కొలిమిగుండ్ల, అవుకు మండలాల నుంచి 300 ట్రాక్టర్ల మేర నాపరాళ్లను అనంతపురం, తాడిపత్రితో పాటు పలు ప్రాంతాలకు రవాణా చేసేవారన్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా పూర్తిగా నిలిచిపోయిందన్నారు. పది రోజులు దాటినా సమస్య పరిష్కారం కాకపోవడంతో పనులు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున స్థానిక ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకుని సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.

'జీడిపల్లి' నుంచి బెలుగుప్ప, శీర్పి చెరువులకు నీరు

ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-బెలుగుప్ప

పరిశీలిస్తున్న ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్

మండల పరిధిలోని జీడిపల్లి రిజర్వాయర్ నుంచి బెలుగుప్ప, శీర్పి చెరువులకు నీరందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని శీర్పి, బెలుగుప్ప చెరువులకు జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పంపింగ్ స్టేషన్ 9,10 ద్వారా చెరువులకు నీరు వెళ్లే కాలువను శీర్పి వద్ద అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జీడిపల్లి రిజర్వాయర్ నుండి పంపింగ్ స్టేషన్ 9,10 ద్వారా బెలుగుప్ప, శీర్పి చెరువులకు నీరందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ఎస్ గుంతకల్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసనాయక్, డిఇ వెంకటరమణ, ఎఇఇ ఎ.సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం అభివృద్ధికి సహకరించాలని వినతి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

కలెక్టర్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

వెనుకబడిన ప్రాంతమైన కళ్యాణదుర్గం అభివృద్ధికి సహకరించి నిధులు వచ్చేలా చూడాలని కలెక్టర్ ఆనంద్‌ను స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కోరారు. ఈమేరకు గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి పలు విషయాలను వివరించారు. ముఖ్యంగా గ్రామాలకు సరైన రహదారులు లేక ఇబ్బంది పడుతున్నామని, బీటీపీ కాలువ కోసం భూములు కోల్పోయిన మరికొంతమంది రైతులకు పరిహారం వచ్చేలాచూడాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు ఉపాధి అవకాశాలు లేక ఉన్నత చదువులు చదివిన కూలీ పనులు చేస్తున్నారని ఎపిఐఐసి ద్వారా భూములు కొనుగోలు చేసిన ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు అన్ని రకాల ప్రోత్సాహకాలు అందేలా చూడాలని, టమోటా పంటకు గిట్టుబాటుధర లభించేలా చూడాలని, ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు చొరవ చూపాలని ఎమ్మెల్యే కలెక్టర్‌ను కోరారు.

ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల తేదీ వాయిదా

వైకుంఠం ప్రభాకర్‌చౌదరి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాలను వాయిదా వేసినట్లు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి తెలిపారు. గురువారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తారకరామారావు శతజయంతి ఉత్సవాలను ఈనెల 28వతేదీన రాయలసీమ స్థాయిలో నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. అయితే ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు విదేశీ పర్యటనలో ఉన్నందున, పలు కమిటీల సభ్యులు కూడా అందుబాటులో ఉండని నేపథ్యంలో ఉశత జయంతి ఉత్సవాలను వాయిదా వేశామన్నారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల రోజు సినీ రంగంలో సేవలు అందించిన రాయలసీమకు చెందిన సినీ కళాకారులు, డైరెక్టర్లు, నిర్మాతలు, హీరోలు, నటులు, మ్యూజిక్ డైరెక్టర్లను పిలిచి సన్మానిస్తామన్నారు. తేదీని త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

జెసి వ్యాఖ్యలు సరికాదు..

స్పందించిన డిఐజి, ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం

తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి తాడిపత్రి ఎస్పీ రోహిత్‌కుమార్‌పై చేసిన వ్యాఖ్యలను డిఐజి డాక్టర్ షిమోసి గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. తాము ఆల్ ఇండియా సర్వీసు సభ్యులమై దేశ సేవ చేయడమే ప్రధాన ధ్యేయంగా ఉంటామని తెలిపారు. కులం, మతం, ప్రాంత తేడాలు తమ సేవా ధోరణిలో ఏ మాత్రం ప్రభావం చూపవన్నారు. తమపై చేసిన వ్యాఖ్యలు తమ విధి నిర్వహణలో ఎటువంటి ఆటంకం కలిగించవన్నారు. తమ నిబద్ధత, మనోధైర్యాన్ని దెబ్బతీయలేవని చెప్పారు. ఒక ఐపిఎస్ అధికారిని అవమానకర భాషలో సంబోధించడం పరిపాలనా ప్రమాణాలకు విరుద్ధమని హెచ్చరించారు. పోలీసు శాఖ ప్రజా శాంతి భద్రత, చట్ట స్వతంత్ర కాపాడటానికి నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ విధమైన వ్యాఖ్యలు తమ సేవాభావం, నిబద్ధతను ఏ మాత్రం ప్రభావితం చేయబోవన్నారు. తమ విధులను నిబద్ధతతో, నిష్పక్షపాతంగా వ్యవహరిస్తామన్నారు.

జెసి వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు : ఎస్పీ జగదీష్

జెసి ప్రభాకర్‌రెడ్డి ఎఎస్పీపై చేసిన వ్యాఖ్యలు చట్టపరంగా నేరమైనవని, వాటిపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ జగదీష్ అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోలీసులు విధులు నిర్వహిస్తూ ఉన్నారన్నారు. అది కూడా పోలీసు అమవీరుల దినోత్సవంలో పాల్గొని వారి సేవల గురించి వీలైతే నాలుగు మంచి మాటలు చెప్పాల్సిందిపోయి ఈరకమైన వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. ఒక అధికారిని వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ మాట్లాడటం తగదన్నారు. ఇది చట్టపరంగానూ నేరమన్నారు. దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. 'మా వద్దకూడా గన్ ఉందని' చెప్పిన వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ అవసరమైతే ఆయన గన్ లైసెన్సు రద్దు చేయడంపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

ఎస్పీని కలిసేందుకు జెసి ప్రయత్నం

తాడిపత్రిలో ఎఎస్పీ రోహిత్‌కుమార్‌పై చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వడానికి తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి గురువారం అనంతపురం విచ్చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసేందుకు ఆయన ప్రయత్నించారు. గంటకుపైగా వేచి ఉన్నా ఎస్పీ అపాయింట్ లేకపోవడంతో ఆయన వెనుదిరిగి వెళ్లారు. ఈ నేపథ్యంలో డిఐజి, ఎస్పీలు మీడియాతో పై విధంగా స్పందించడం గమనార్హం.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యంలో మస్టర్ పాయింట్ల వద్ద నిరసన

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

కార్మికులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఉదయం నగరంలోని ఆరు సర్కిళ్లలో మస్టర్ పాయింట్ల వద్ద నిరసన వ్యక్తం చేశారు. తెల్లవారుజామున ఆయా సర్కిళ్లలోని మసర్ పాయింట్లలో హాజరు పలికిన తర్వాత నిరసనకు దిగారు. ఈ సందర్భంగా నగర కమిటీ నాయకులు మాట్లాడుతూ మూడేళ్లుగా మృతిచెందిన కార్మికుల కుటుంబాల్లో ఉపాధి కల్పించకపోవడం బాధాకరమన్నారు. పెరిగిన నగరానికి అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచి పని భారం తగ్గించాలని కోరుతున్నా పట్టించుకునే వారే లేకుండా పోయారన్నారు. కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వాలన్నారు. ఇప్పటికైనా ఆయా సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, నగర అధ్యక్ష, కార్యదర్శు లు వెంకట్‌నారాయణ, ముర్తుజా, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎటిఎం నాగరాజు, నాగభూషణం, నగర అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్, తిరుమలేష్ పాల్గొన్నారు.

'ఆరోగ్యశ్రీని కొనసాగించేది లేదు'...

అనంతపురం : బకాయిలు తొలగించే వరకూ రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని కొనసాగించేది లేదని అనంతపురం ఆశ సభ్యులు డాక్టర్ కేతిరెడ్డి మోహన్‌రెడ్డి, డాక్టర్ నిరంజన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈమేరకు గురువారం విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద రాష్ట్ర ప్రైవేట్ నర్సింగ్ హోమ్స్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన మహాధర్నా కార్యక్రమంలో అనంతపురం నుంచి నర్సింగ్ హోమ్ యాజమాన్యాలు వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రూ.2700కోట్ల బకాయిలు ఉన్నా సేవలందించామన్నారు. గత ప్రభుత్వం తప్పిదాలను ఈ ప్రభుత్వం కూడా కొనసాగించడం వల్ల ప్రయివేటు ఆసుపత్రులపై భారం పడుతోందన్నారు. 14 రోజుల నుంచి ఆరోగ్యశ్రీ బంద్ చేసిన ప్రభుత్వం మానవత్వంతో వ్యవహరించడం లేదన్నారు. కావున ప్రభుత్వం స్పందించి ఆరోగ్యశ్రీ బకాయిలను చెల్లించాలని కోరారు.

'అనంత' టౌన్‌ప్లానింగ్‌లో ఒంటెద్దు పోకడ

నక్ష సర్వే 89శాతం మాత్రమే ..
సర్వేలో డబుల్ ఎంట్రీలు..
ఆరు నెలలైనా టిపిఎస్‌కు లాగిన్ ఐడి ఇవ్వని వైనం..

అనంతపురం నగరపాలకసంస్థ కార్యాలయం

ప్రజాశక్తి - అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగరపాలకసంస్థ పరిధిలోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఒంటెద్దు పోకడ కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నక్ష (పట్టణ నివాసాల యొక్క జాతీయ జియో స్పేషియల్ నాలెడ్జ్ ఆధారిత భూసర్వే) సర్వే అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో నత్త నడకన సాగుతోంది. గడువు ముగిసి పది రోజులు దాటినా 89శాతం మాత్రమే పూర్తయింది. నక్ష సర్వే ప్రోగ్రాం పూర్తికావటానికి చర్యలు చేపట్టాల్సిన టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో సచివాలయ ప్లానర్స్ తిరుగుబాటు చేశారు. ఫలితంగా నక్ష సర్వే ప్రోగ్రాం సకాలంలో పూర్తికాని పరిస్థితి నెలకొంది. సర్వే సకాలంలో పూర్తి కావటానికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సచివాలయం ప్లానర్స్ గడువుకు నెల రోజుల ముందే ఆదేశించినప్పటికీ ఫలితం కన్పించలేదు. ఇన్‌ఛార్జి అసిస్టెంట్ సిటీ ప్లానర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో సచివాలయ ప్లానర్స్ సహాయ నిరాకరణ చేపట్టారు. నక్ష సర్వే ప్రోగ్రాం నతనడకన సాగటానికి కారణమైన టిపిఒపై క్రమశిక్షణ చర్యలు చేపట్టకుండా ఉన్నతాధికారి ఉదాసీన వైఖరి అవలంబించడం కూడా ఒక కారణంగా మారింది. దీనితో సెప్టెంబర్ 29 నాటికి వందశాతం పూర్తి కావాల్సిన నక్ష సర్వే ప్రోగ్రాం అప్పటికి 84 శాతం మాత్రమే పూర్తయింది అయితే గడువు దాటి పది రోజులు దాటినా 89 శాతం మాత్రమే పూర్తయింది ఇందులోనూ డబుల్ ఎంట్రీస్ ఉండటంతో వాటిని గుర్తించి తొలగించటంపై దృష్టిసారించారు. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ లో నక్ష సర్వే పూర్తి కావటానికి కనీసం మరో నెల రోజులైనా పడుతుందన్న వ్యాఖ్యానాలు వినపడుతున్నాయి. టౌన్ ప్లానింగ్ విభాగంలో ఓ అధికారిని పనితీరు అధ్వానంగా మారిన శాఖా పరమైన చర్యలకు అధికార వర్గాలు చర్యలు చేపట్టకపోవడం ఉద్యోగ వర్గాలను విస్మయానికి గురిచేస్తుంది.

ఒంటెత్తు పోకడలు : టిపిఒ ఒంటెత్తు పోకడలు అవలంభిస్తోందన్న విమర్శలు ఉన్నాయి. టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ మంజులను సరెండర్ పేరుతో వేధింపులకు గురి చేశారు. ఇదే ఆదనుగా మంజుల లాగిన్ ఐడిని సైతం బ్లాక్ లిస్టులో పెట్టించారు. అయితే టీపీఎస్‌పై సరెండర్ ఉత్తర్వులు ఉపసంహరించినప్పటికీ లాగిన్ ఐడిని పునరుద్ధరించకుండా ఆరు నెలలుగా పెండింగ్లో ఉంచటంతో ఆమె బదిలీకి ప్రయత్నిస్తున్నట్లు ఉద్యోగ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇప్పటికే టౌన్ ప్లానింగ్ విభాగంలో కేవలం టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ మాత్రమే మిగిలారు. ఇద్దరు అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, ఇద్దరు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లు, ఇద్దరు టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్లు, 8 మంది బిల్డింగ్ ఇన్స్పెక్టర్లు పని చేయాల్సిన చోట ఒక టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, ఒక టి పి ఎస్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఉన్న ఇద్దరిలో సహోద్యోగి టిపిఎస్ కు లాగిన్ ఐడి ఇవ్వకుండా టిపిఒ వ్యవహరించడాన్ని బట్టి చూస్తే టౌన్ ప్లానింగ్‌ను నిర్వీర్యం చేయటమే లక్ష్యంగా టిపిఒ వ్యవహరిస్తున్నట్లు ఉందని ఉద్యోగ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ విభాగంలో కోర్టు పనులకు వెళ్లే ఉద్యోగులకు కనీసం కోర్టు ఖర్చులకు కూడా పైసా విదల్చని పరిస్థితి నెలకొనడం ఆమె ఒంటెత్తు పోకడలకు నిదర్శనంగా నిలుస్తోందన్న వ్యాఖ్యానాలు వినపడుతున్నాయి.కార్పొరేషన్‌కు బిల్డింగ్ ప్లాన్‌ల రూపంలో రావలసిన ఫీజుల రాబడికి కూడా గండి పడుతున్నా పట్టనట్లు వ్యవహరిస్తోందని చర్చించుకుంటున్నారు. అలాగే అడ్వర్టైజ్‌మెంట్ టాక్స్ రూపంలో మున్సిపల్ కార్పొరేషన్ కు రావాల్సిన రాబడి విషయంలో కూడా నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇలాంటి వ్యవహారాల వల్ల టౌన్ ప్లానింగ్ విభాగం ద్వారా వచ్చే ఆదాయం మున్సిపల్ కార్పొరేషన్‌కు భారీ ఎత్తున గండి పడుతోందని తెలుస్తోంది.

స్థాయి మరిచి అసభ్యమాటలా..

కార్మికుల మధ్య చిచ్చు పెట్టడం తగదు
'దుర్గం' కమిషనర్‌పై మున్సిపల్ యూనియన్ నాయకుల ఆగ్రహం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

కళ్యాణదుర్గం మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్ కార్మికులను దుర్భాషలు ఆటడం, బెదిరింపులకు దిగటం తగదని మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం, జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు అన్నారు. ఇటీవల కళ్యాణదుర్గం మున్సిపల్ కమిషనర్ వ్యవహారశైలితో నలిగిపోతున్న పారిశుధ్య కార్మికులతో స్థానిక మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకుడు వన్నూరుస్వామి అధ్యక్షతన గురువారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు అండగా నిలవాల్సిన కమిషనర్ వారిపైనే అసభ్య పదజాలంతో మాట్లాడడం మంచిది కాదన్నారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్ ఆలీఖాన్ కార్మికులకు సెలవులు ఇవ్వకుండా వేదిస్తున్నాడని, వేతనాల్లో కోత విధిస్తున్నారని, గ్రూపులుగా విభజించి గొడవలు పెడుతున్నారని మండిపడ్డారు. అంతేగాకుండా కొంతమందిని సొంత పనులకు వాడుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్మికుల మేస్త్రీగా కొనసాగిస్తున్న రామాంజినేయులను మేస్త్రీ నుంచి తొలగించి కార్మికునిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కమిషనర్ వ్యవహారశైలిపై శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. 27న రీజినల్ డైరెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక యూనియన్ ఉపాధ్యక్షుడు తిమ్మప్ప, నాయకులు నటరాజ్, వెంకటేశులు, వన్నూరుస్వామి, నటరాజు, దుర్గమ్మ, శేషాద్రి, సరస్వతి, యల్లక్క, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ఉద్యోగోన్నతులు కల్పించాలని వినతి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

సచివాలయ ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని ఉద్యోగుల జెఏసి నాయకులు కోరారు. ఈమేరకు గురువారం నగరంలోని స్వగృహంలో ఆర్థికశాఖ మంత్రి కేశవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నోషనల్ ఇంక్రిమెంట్స్ మంజూరు చేయాలని, అర్హత సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్ స్కీం ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని కోరారు. అలాగే 9 నెలల అరియర్స్ మంజూరు చేయాలని, సీనియార్టీ లిస్టు విడుదల చేసి ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా 2019లో రిక్రూట్ అయిన అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలకు ఇప్పటికే ఉద్యోగోన్నతులు కల్పించి మెరుగైన పే స్కేల్ తీసుకుంటున్నారన్నారు. కావున ఆ స్కేలు తగ్గకుండా ఉద్యోగోన్నతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జెఏసి నాయకులు డి.సుధాకర్, వి.లక్ష్మీనారాయణ, వరప్రసాద్, మల్లికార్జున, చంద్ర, చిన్నారప్ప, శివశంకర్, రామకృష్ణ, కిషోర్, విమల, నారాయణస్వామి, నాగరాజు, కృష్ణమూర్తి, మల్లికార్జున, కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

సుంకాలను ఉపసంహరించుకోవాలి

సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల

ప్రజాశక్తి-పుట్లూరు

అమెరికా సామ్రాజ్యవాదం, ట్రంప్ ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తులపై పెంచిన సుంకాలను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ఎస్.సూరి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ సర్కిల్ వద్ద అమెరికా సామ్రాజ్యవాదం, ట్రంప్ ప్రభుత్వ వ్యవసాయ ఉత్పత్తులపై పెంచిన సుంకాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రంప్ విధించిన సుంకాలతో వ్యవసాయ రంగం, పాడి పరిశ్రమ, ఎగుమతి రంగాలు తీవ్రంగా దెబ్బతింటాయన్నారు. రైతులు దివాళా తీయాల్సి వస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమెరికా సామ్రాజ్యవాద విధానాలను ప్రశ్నించకపోవడంతో దాదాపు 150 కోట్ల భారత ప్రజల గౌరవాన్ని అవమానించడమే అని విమర్శించారు. ఇకపోతే అభివృద్ధి పేరుతో రాష్ట్రంలో 32 కేంద్రాల్లో దాదాపు మూడు లక్షల ఎకరాల భూములను కార్పొరేట్లకు పొందుపరుస్తున్నారన్నారు. వెంటనే బలవంతపు భూసేకరణను తక్షణం ఆపాలని, 2013 చట్టాన్ని పూర్తిగా అమలు చేయాలని, భూములను సేకరించిన ప్రాంతాల్లో 18 ఏళ్ల నిండిన ప్రతి వ్యవసాయ కార్మికుడికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు టి.పెద్దయ్య, వి.కుళ్లాయప్ప, జె.పెద్దయ్య, కె.నాగభూషణం, వెంకటరాముడు, భాస్కర్‌రెడ్డి, ఉమాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

‘ప్రజా ఉద్యమం’లో భాగస్వాములు కావాలి

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన ‘ప్రజాఉద్యమం’లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం అనంతపురంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ‘వైసిపి ప్రజా ఉద్యమం’ సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఇందులో భాగంగా ఈనెల 28న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా అనంతపురంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. అలాగే అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించి ఆర్డీఓలు, తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. ఈ ప్రజా ఉద్యమంలో మేధావులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న వైసిపి నాయకులు

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన పారిశుధ్య పనులను కమిషనర్ బాలస్వామి గురువారం ఉదయం పరిశీలించారు. ముందుగా 66వవార్డు సచివాలయ పరిధిలోని 4, 5వ రోడ్లలో చేపట్టిన ఇంటింటి చెత్త సేకరణపై ఆరాతీశారు. ఇందులో భాగంగా ఇంటింటి చెత్త సేకరణ, కాలువలలో పూడికతీతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ముందుకు సాగారు. అదేవిధంగా హమాలీ కాలనీలో పారిశుధ్య పర్యవేక్షణ చేస్తూ రోడ్డుకిరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని సిబ్బందికి సూచించారు. రోజూ చెత్త తరలింపు జరిగే ప్రక్రియను వాహన డ్రైవర్లను అడిగి అడిగి తెలుసుకున్నారు. టవర్‌క్లాక్, కమలానగర్, కోర్టు రోడ్డు, రామ్‌నగర్, తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం బళ్లారి రోడ్డులోని అన్న కాంటీన్‌ను తనిఖీ చేశారు.

చెత్త సేకరణను పరిశీలిస్తున్న కమిషనర్ బాలస్వామి

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి-గుత్తి

విద్యార్థులు ఇష్టపడి చదివితే అత్యుత్తమ ఫలితాలు సాధిస్తారని శ్రీ సాయి కళాశాల క్యాంపస్ సిఇఒ ఎ.శ్రీరాములు, ప్రజా వైద్యశాల పిఆర్పీ బి.ఇస్మాయిల్, పిఆర్ఆర్ ఎంబిఎ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ప్రసన్నకుమార్ సూచించారు. గురువారం పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ రంగస్వామిరెడ్డి అధ్యక్షతన ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఉద్దేశంతో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి గుత్తిలో కళాశాలలను స్థాపించారన్నారు. చాలామంది విద్యార్థులు ఉద్యోగస్తులుగా తీర్చిదిద్దిన ఈ కళాశాలలో బాగా చదివి కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు తేవాలన్నారు. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు. చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం ముఖ్య అతిథి బి.ఇస్మాయిల్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్య అతిథి ఇస్మాయిల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

సంజీవరెడ్డికి ఎడ్యుఐకాన్ అవార్డు

నార్పల : విద్యారంగంలో విశేష కృషి చేస్తున్న సరస్వతి విద్యా మందిరం హైస్కూల్ కరస్పాండెంట్ మోరుసు సంజీవరెడ్డి గురువారం విశాఖపట్నంలోని హోటల్ ఫెయిర్ ఫీల్డ్ మ్యారియట్‌లో స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్, నిషా అపుస్మా, ట్రస్మాతో కలిసి మల్లబ్యూరో ఆఫ్ చైల్డ్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ వారు దేశవ్యాప్తంగా అందించే ఎడుఐకాన్ 2025 అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతను పలువురు మిత్రులు, బంధువులు అభినందించారు.



అవార్డు అందుకుంటున్న సంజీవరెడ్డి

మురుగు కాలువల్లో చెత్త తొలగింపు

ప్రజాశక్తి-శింగనమల

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు టిడిపి నాయకులు సుధాకర్ మండల పరిధిలోని చిన్న జలాలపురం ఎస్సీ కాలనీలో ఉన్న డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తను జెసిబితో తొలగించారు. దీంతో ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

జెసిబితో డ్రెయినేజీని శుభ్రం చేయిస్తున్న సుధాకర్

రైతుల సమస్యలపై పోరాడుదాం

రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు విరుపాక్షి

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా పోరాడుదామని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు విరుపాక్షి పిలుపునిచ్చారు. గురువారం వజ్రకరూరు మండల కేంద్రంలో మండల రైతుసంఘం మహాసభ నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయన్నారు. ముఖ్యంగా రైతుల భూములను సోలార్ పేరుతో కార్పొరేట్లకు కట్టబెట్టడానికి ప్రభుత్వాలు ఆదేశాలు ఇవ్వడం రైతులకు తీవ్ర అన్యాయం చేయడమే అన్నారు. హంద్రీనీవా ద్వారా మండలంలోని పిల్ల కాలువలు పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు ఇవ్వాలన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతు సంఘం మండల నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షులుగా ఓబుళపతి, ప్రధాన కార్యదర్శి గా చాబాల సుధాకర్, కమిటీ సభ్యులుగా చిన్న, పెద్దన్న, లక్ష్మయ్య, రంగయ్య, మాబు బాషాను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో నబిరసూల్, సిఐటియు నాయకులు సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు విరూపాక్షి

ప్రజల వినతులకు పరిష్కారం చూపాలి

ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు తక్షణం పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా తాడిపత్రి మున్సిపల్ కార్యాలయం పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. అండర్ డ్రెయినేజీ, పారిశుధ్యం నిర్వహణ, మంచి నీటి వసతులు, పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ప్రజలను కార్యాలయం నుంచి తిప్పుకోకుండా వినతులకు పరిష్కారం చూపాలన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో రోజూ పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సబ్బి శివరామకృష్ణ, మున్సిపల్ డిఇ రామ్‌ప్రసాద్, మున్సిపల్ వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

నియోజకవర్గం పరిధిలోని 92 కుటుంబాలకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి అందజేశారు. నియోజకవర్గ పరిధిలో పలువురు వైద్యులు వైద్యానికి రూ.లక్షలు వెచ్చించి ఆర్థికంగా దెబ్బతిన్న 92 కుటుంబాలకు రూ.54,61,355 మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు.

నకిలీ మద్యం, బెల్టుషాపులకు చెక్

ఎమ్మెల్యే సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నకిలీ మద్యం, బెల్టుషాపులకు చెక్ పెట్టామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. గురువారం పట్టణంలోని ప్రజావేదిక వద్ద ఎక్సైజ్ శాఖ తీసుకొచ్చిన ‘సురక్షయాప్’ను ఎక్సైజ్ సీఐ సోమశేఖర్, సిబ్బందితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనలో జే బ్రాండ్లతో ఎంతోమంది కిడ్నీలు పోగొట్టుకుని ప్రాణాలు కోల్పోయారన్నారు. అయితేకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లు నాణ్యమైన మద్యం అమ్మకాలకు చర్యలు తీసుకున్నారన్నారు. నకిలీ మద్యం విషయంలో సీఎం కఠినంగా ఉన్నారన్నారు. ఇకపోతే హంద్రీనీవా ద్వారా రాయలసీమ ప్రాంతానికి 3800 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. బీటీపీ పనులు పూర్తి చేస్తామని స్వయాన సీఎం చంద్రబాబు పలుమార్లు చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో యార్డు ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి, సీనియర్ నాయకులు మల్లికార్జున, వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

స్థానిక ప్రజావేదిక వద్ద గురువారం నియోజకవర్గంలోని పలువరు బాధితులకు మంజూరైన సిఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని 22 మంది బాధితులకు రూ.10.32 లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సహకార సంఘం అధ్యక్షులు మల్లిపల్లి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

యాప్‌లో మద్యం నాణ్యతను పరీక్షిస్తున్న ఎమ్మెల్యే, ఎక్సైజ్ అధికారులు

శాంతినారాయణకు ‘అమృతలత’ పురస్కారం

ప్రజాశక్తి-అనంతపురం

రెండు తెలుగు రాష్ట్రాల సాహిత్య లోకంలో ప్రతిష్టాత్మకమైన ‘అమృతలత’ సాహిత్య జీవన సాఫల్య పురస్కారం–2024కు జిల్లాకు చెందిన ప్రముఖ సాహితీవేత్త శాంతి నారాయణను ఎంపిక చేశారు. ఈమేరకు వచ్చేనెల 2వతేదీన నిజామాబాద్‌లోని శ్రీవారి అపురూప కళ్యాణమంటపంలో నిర్వహించనున్న కార్యక్రమంలో శాంతినారాయణ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ సందర్భంగా శాంతినారాయణ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన పురస్కారం తనకు రావడం సంతోషంగా ఉందన్నారు. అంతేగాకుండా సాహితీ రంగంలో మరింత బాధ్యతను పెంచుతుందన్నారు.

25న జాబ్‌మేళా

ప్రజాశక్తి-గుంతకల్లు

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎపిఎస్ఎస్డిసి), కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 25వతేదీన నిర్వహించనున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈమేరకు గురువారం కసాపురం రోడ్డులోనిశంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో ఇందుకు సంబంధించిన ప్రచార గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25వ తేదీన శనివారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, కళాశాల కరస్పాండెంట్ కేసీ.హరికుమార్‌తో కలిసి జాబ్‌మేళాను ప్రారంభిస్తారన్నారు. కావున నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్.. 63044 26349, 80967 63970 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్.సురేష్‌బాబు, అధ్యాపకులు నటరాజ్, బసెట్టి క్రిష్టయ్య, కురుపాటి రాకేష్, బాలగంగాధర్ తిలక్, కంపెనీ ప్రతినిధులు శ్రావణి, లోకేష్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

యాడికి : మండల పరిధిలోని రాయలచెరువులో ఉన్న లయన్స్ క్లబ్ కార్యాలయంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వారు 60 మందికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 30 మందికి కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. శిబిరానికి వచ్చిన వారికి ట్రెజరర్ అల్లాబకాష్ భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు లక్ష్మీనారాయణశెట్టి, సెక్రటరీ రామనాథ్, రవిప్రసాద్, సత్యనారాయణ, ఇస్మాయిల్, రవికుమార్‌రెడ్డి, శేషానందరెడ్డి, సూర్యనారాయణ, దివాకర్‌రెడ్డి, ఎల్ఐసి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నార్పల సింగిల్‌విండో ఛైర్మన్‌గా మహేష్‌నాయుడు

ప్రజాశక్తి-నార్పల

మండల సింగిల్‌విండో ఛైర్మన్‌గా సుల్తాన్‌పేటకు చెందిన మహేష్‌నాయుడు నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా మహేష్‌నాయుడు మాట్లాడుతూ తనకు సింగిల్‌విండో ఛైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఎడిసిసి బ్యాంచు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు చేస్తానన్నారు. దీనికితోడు సొసైటీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

‘నెట్టికంటి’ ఆలయంలో అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న నూతన కట్టడాల పనులను మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణస్వామి గురువారం పర్యవేక్షించారు. ఆలయంలో నూతనంగా నిర్మిస్తున్న రాజగోపురం, నూతన దుకాణాల ఏర్పాట్లు, కలిశ స్థాపన, ఈనెల 29వ తేదీ జరిగే కుంభాభిషేక పనులను పరిశీలించడంతోపాటు పురోగతిపై ఆలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఈనెల 29వ తేదీ జరిగే హనుమాన్ మహాయాత్రలో భక్తులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఎఇఒ ఓంకారం వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, టిడిపి మండల అధ్యక్షుడు రామన్నచౌదరి, నాయకులు హనుమన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న నాయకులు

ఫెన్సింగ్ పోటీల్లో ‘పివికెకె’ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురంలోని పివికెకె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విద్యార్థి సురుత్‌సింహ ఫెన్సింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. ఇటీవల నంద్యాలలో జరిగిన జెఎన్‌టియు ఇంటర్–కాలేజియేట్ ఫెన్సింగ్ పోటీల్లో సురుత్ సింహ సేబర్ విభాగంలో పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచి జెఎన్‌టియు తరుపున పంజాబ్‌లోని గురునానక్ దేవ్ యూనివర్సిటీ, అమృత్‌సర్‌లో జరిగే టోర్మమెంట్‌లో ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్న సురుత్ సింహ వంటి విద్యార్థులు తమ కళాశాలకు గర్వకారణమన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని కళాశాల ఛైర్మన్ డాక్టర్ పల్లె కిషోర్‌రెడ్డి, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి అవనిజ, ఫిజికల్ డైరెక్టర్ ధనుంజయ, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థితో అధ్యాపకులు

తైక్వాండో జూనియర్ ఛాంపియన్‌షిప్ పోస్టర్ విడుదల

అనంతపురం సిటీ : అనంతపురంలో ఈనెల 25, 26వతేదీల్లో ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ జూనియర్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌నకు సంబంధించిన పోస్టర్లను రాయలసీమ రీజియన్ డిఐజీ ఆఫ్ పోలీస్ కోయ ప్రవీణ్‌కుమార్ గురువారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు శాంతరాజ్, రామాంజి, తులసి, వెంకటేష్, రాజేష్, రామ్మోహన్‌రెడ్డి, బిలాల్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలకు అంటు కట్టే విధానంపై అవగాహన

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మెట్ట ప్రాంతాల్లో అనువైన పండ్ల మొక్కల్లో అంటుకట్టే పద్ధతి విధానాలపై గురువారం మండల పరిధిలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా మామిడిలో అయితే వెనీర్ గ్రాఫ్టింగ్, చీనీలో అయితే టీ బడ్డింగ్, దానిమ్మ, జామ పండ్ల మొక్కల్లో అయితే గాలి అంట్లు లేదా గూటి అనే పద్ధతి, ఫాల్సా, కరెండాలో విత్తనం, కొమ్మల కత్తిరింపు ద్వారా మొక్కల ప్రవర్తనంపై వివరించారు. అలాగే చీనీ, మామిడిలో అంటుకట్టే విధానాన్ని రైతులు, అగ్రికల్చర్ పాలిటెక్నిక్ విద్యార్థులకు ప్రాక్టికల్‌గా ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా చూపించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ మల్లీశ్వరి, విస్తరణ శాస్త్రవేత్త చందన, ఉద్యానవన శాస్త్రవేత్త జిటి మాధవి, టెక్నికల్ అసిస్టెంట్ విష్ణు, గొల్లపల్లి, రెడ్డిపల్లి, దుర్గం రైతులు, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

నేటి నుంచి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు

పుట్లూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఈనెల 24, 25వ తేదీల్లో స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, ఎంఇఒలు శ్రీదేవి, ప్రేమ్‌కుమార్, మండల క్రీడల కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 24న అండర్–14, 17 బాలికలు, 25న అండర్–14 బాలురకు షటిల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, చెస్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు కేంద్రం అనుమతి

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలలో ఇళ్లు లేని పేదలకు కేంద్రం తీపి కబురు అందించింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు లేని పేదలను గుర్తించేందుకు నవంబర్ 5వతేదీ వరకు గడువు కల్పించినట్లు కలెక్టర్ ఓ.ఆనంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఇంటి సర్వే చేపట్టాలని జిల్లాలో పని చేస్తున్న సచివాలయ సిబ్బంది, గృహనిర్మాణ శాఖ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

ప్రత్యేక ఉపకారాగారం తనిఖీ

గుత్తి : గుత్తిలోని ప్రత్యేక ఉపకారాగారాన్ని జిల్లా న్యాయ సేవా సమితి కార్యదర్శి ఎన్.రాజశేఖర్ గురువారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా జైలులోని రికార్డులు, బ్యారెకులు,వంటగది, స్టోర్ గది, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో ఆయన సమావేశం అయ్యారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ మహేశ్వరుడు, న్యాయవాది ఎ.సూర్యనారాయణ, కోర్టు టైపిస్ట్ సాదిక్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎన్.రాజశేఖర్

బాధితుడికి పరామర్శ

యాడికి : రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండల కేంద్రంలోని అంత్రాల వీధిలో నివాసం ఉంటున్న జానాపాటి శ్రీనివాసులును వైసిపి నాయకులు గురువారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు బొంబాయి రమేష్‌నాయుడు, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపిటిసి అవుకు నాగరాజు, గొడ్డుమర్రి రామమోహన్, గుంత తిరుపతి, చిట్టెంరెడ్డి బాలరెడ్డి, అవుకు భార్గవ, దూద్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల, అంగన్వాడీ కేంద్రం తనిఖీ

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని తీటకల్లు గ్రామ సచివాలయంలోని అంగన్వాడీ సెంటర్‌తోపాటు ప్రాథమికోన్నత పాఠశాలను కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాణిఎస్తేరు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సెంటర్‌లోని కార్డులను తనిఖీ చేసి చిన్నారులకు ఇవ్వాల్సిన రేషన్, గర్భిణులకు ఇచ్చే గుడ్లు, పాలు, తదితర స్టాకు పరిశీలించారు. అదేవిధంగా ఏఎన్ఎం రికార్డులు, ఆశావర్కర్ పుస్తకాలను తనిఖీ చేశారు. తర్వాత ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి పిల్లలకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వనచంద్ర, ఏఎన్ఎం వన్నూరమ్మ, అంగన్వాడీ కార్యకర్త నళిని, ఆశావర్కర్ గంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న రాణిఎస్తేర్

నోటు పుస్తకాలు అందజేత

అనంతపురం : అనంతపురం పోలీస్ రక్షక్ ప్రైమరీ స్కూలు విద్యార్థులకు ఎజిఎస్ ఫౌండేషన్ వారు గురువారం డిజిటల్ స్లేట్స్, నోట్ పుస్తకాలు, పెన్సిళ్లు, హ్యాండ్ వాష్ కిట్లను వితరణ చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ పి.జగదీష్ విద్యార్థులకు ఆయా సామగ్రి అందించారు. ఈకార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్పీ షేక్ ఇలియాస్‌బాషా, ఎఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, ఆర్ఐ అడ్మిన్ పవన్‌కుమార్, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, ఆర్ఎస్ఐలు బాబ్‌జాన్, రమేష్‌నాయక్, స్కూల్ అధ్యాపక బృందం సభ్యులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎస్పీ జగదీష్

చెత్త సేకరణపై విచారణ

శింగనమల : మండల పరిధిలోని సలకంచెరువు, కల్లుమడి గ్రామాల్లో పొడి, తడిచెత్త సేకరణపై జెడ్పీ సీఈవో జి.శివశంకర్ గురువారం విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా చెత్త సేకరణపై ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈవో మాట్లాడుతూ గ్రామంలోని బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేసే విషజ్వరాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. చెత్తను మీ ఇంట్లోనే ఓ డబ్బాలో వేసుకుని పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ భాస్కర్, ఇఒఆర్‌డి విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ఓబిరెడ్డి, కొల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.



చెత్త సేకరణ వివరాలను సేకరిస్తున్న అధికారులు

‘క్యాట్’లో శ్రీచైతన్య విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-అనంతపురం

క్యాట్ మొదటి లెవెల్ పరీక్షల్లో అనంతపురం జోన్‌కు చెందిన శ్రీచైతన్య విద్యార్థులు అత్యధికంగా 2వ లెవల్‌కు ఎంపికైనట్లు విద్యాసంస్థల ఎజిఎం సుబ్బారెడ్డి తెలిపారు. ఈమేరకు ఆయా విద్యార్థులను గురువారం స్థానిక కమ్మభవన్ సమీపంలోని శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ఎజిఎం మాట్లాడుతూ మ్యాథమెటిక్స్ సబ్జెక్టులో 708, ఫిజిక్స్ సబ్జెక్టులో 446, కెమిస్ట్రీ సబ్జెక్టులో 754 మంది విద్యార్థులు 2వ లెవెల్‌కు అర్హత సాధించినట్లు తెలిపారు. పటిష్టమైన పాఠ్యప్రణాళిక, అత్యంత నైపుణ్యం కలిగిన బోధన, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం కలిసి ఇంతటి ఘనవిజయం సాధించానికి వీలైందన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జోన్‌కు చెందిన ప్రిన్సిపాళ్లు, కోఆర్డినేటర్లు, డీన్లు, ఉపాధ్యాయులు, ఏవోలు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఎజిఎం